# పదవీ-కర్తవ్యం

'ప్రవాసి'



## కలగూరగంప

ప్రాచీనకాలంలో దేవ బ్రాహ్మణ నిందకుడు సకలావ గుణాభిరాముడు మహాపాపి వ్యభిచారియైన జూదరి వుండేవాడు. అనేకరీతులైన వంచనా పద్ధతులతో సదా ద్యూతక్రీడలో విజేతగా రాణించేవాడు. ఒకరోజు కపటపూర్వకంగా జూదమాడి ఎంతో సంపత్తిని గెలుచుకున్నాడు. ఒళ్ళెరగని గర్వంతో అనేకరీతుల సుగంధాలు పుష్పమాలికలు ఏకత్రితం చేసి ఒక వేశ్యాంగనకి సమర్పించడానికి ఆమె ఇంటి వేపు పరుగులు పెట్టుకుంటూ వెళ్ళాడు. దోవలో అడుగులు తడబడి భూమ్మీదపడి మూర్ఛపోయాడు. కొంతసేపటికి మూర్ఛనించి తేరుకుని తెలివివొచ్చింది. అతనికి తన అకృత్యాలపై అసహ్యం దుఃఖం వైరాగ్యం పుట్టుకొచ్చాయి. లేచి అక్కడే సమీపంలో వున్న శివలింగానికి తెచ్చిన సుగంధాలు పుష్పమాలలు అత్యంత శుద్ధ పవిత్ర హృదయంతో సమర్పించి పూజించాడు. తన బతుకంతటిలో అతను చేయగలిగినదదే ఒక్క పుణ్యకర్మ. కొన్నాళ్ళ తరవాత అతను కాలంతీరి కళ్ళుమూశాడు. యమదూతలు వొచ్చి అతన్ని యమలోకానికి తీసుకుపోయారు. "అరే మూర్ఖా! నువ్వు చేసిన ఘోరపాపకర్మల కారణంగా నీకు రౌరవాది మహానరకాగ్నుల్లో మహాయాతన అనుభవించాల్సి వొస్తుంది." అన్నాడు జూదరితో యమరాజు.

"మహాప్రభో! నేను చేసిన పుణ్యకర్మం ఏదయినా వుంటే ముందుగా దాన్ని గురించి యోచించండి." అని యమరాజును ప్రార్థించాడా జూదరి. యమరాజు ఆదేశంతో అతని పాపపుణ్యకర్మల పద్దులు తిరగవేసి "నువ్వు చనిపోడానికి కొద్ది రోజుల ముందు సదా శివుడికి సుగంధాలు, పూలమాలలు సమర్పించావు. అదే నువ్వు సంపూర్ణ జీవనకాలంలో చేసిన ఏకైక సత్కర్మ. ఆ సుకృతకర్మవలన నీకు మూడు ఘడియలు స్వర్గశాసనం ఇంద్రసింహాసనం లభ్యమవుతాయి." అన్నారు చిత్రగుప్తులు.

"అప్పుడా జూదరి "ప్రభూ! ముందుగా నన్ను పుణ్యఫలాన్ని ప్రాప్తించేలా కరుణించండి." అని యమరాజును ప్రార్థించాడు. తరువాత యమధర్మ రాజు ఆదేశానుసారం అనుచరుల వెంట ఆ జూదరిని స్వర్గానికి పంపించారు చిత్రగుప్తులు.

అప్పుడు పరిస్థితిని నచ్చ చెప్పి "నువ్వు మూడు ఘడియలు సింహాసనం వొదిలి ఎటన్నా వెళ్ళి ఆ పుణ్యకాలం గడిచాక తిరిగొచ్చి సింహాసనాన్ని స్వీకరించు." అని ఇంద్రుడికి ఆజ్ఞ నిచ్చారు దేవగురువు బృహస్పతి మహోదయులు. ఇంద్రుడు స్వర్గాన్ని విడిచి వెళ్ళగానే స్వర్గాధిపతి అయ్యాడు ఆ జూదరి. సదాశివుడికన్నా నాకింక శరణెవ్వరింక అన్న సుదృఢ నిశ్చయంతో జూదరి స్వర్గంలో తనకు లభ్యమైన సమస్తైర్యాల్ని దానంచేయడం ఆరంభించాడు. సదాశివ సంస్మరణం చేస్తూ ఆ జూదరి ఐరావత గజేంద్రాన్ని అగస్త్యమహర్షులకి దానం ఇచ్చాడు. 'ఉచ్చైశ్రవమన్న దేవాశ్వాన్ని విశ్వామిత్రుల వారికిచ్చేశాడు. కామధేనువును వశిష్ఠ ఋషీంద్రులకు సమర్పించాడు. చింతామణి రత్నాన్ని గాలవ మహర్షికి కైమోడ్చి కైంకర్యం చేశాడు. కల్పవృక్షాన్ని పెళ్ళగించి కౌండిన్య ఋషీంద్రులకు ఉపాయమానంగా అర్పించాడు. మూడు ఘడియల సింహాసనాధిపత్యకాలం ముగిసేలోపుగా స్వర్గంలో బహుమూల్య పదార్థాలన్నీ ఆ జూదరి సమస్త ఋషీంద్రులకు సమర్పించేశాడు. పుణ్యకాలం పూర్తయ్యేసరికి స్వర్గం శ్రీవిహీనమై శూన్యమైపోయింది.

సమయం గడుస్తూనే స్వర్గానికి తిరిగొచ్చిన ఇంద్రుడు అక్కడి శూన్యతని భరించలేక నిశ్చేష్టుడై ఎలాగో తేరుకుని బృహస్పతులవారిని వెంటబెట్టుకుని యమధర్మరాజుల చెంతకివొచ్చి అత్యంత క్రోధంతో "ధర్మరాజా! తమరు నా పదవినొక జూదరికి ఇచ్చి అత్యంత అనుచిత కార్యం చేశారు. ఆ జూదరి అక్కడ చేరి ఎంతో అనర్థమైన పనిచేశాడు. అతడు నా సభనలంకరించిన సమస్తైశ్వర్యాల్ని ఋషులకు పూర్తిగా దానం చేసేశాడు. స్వర్గం శోభాదరిద్రాణం అయిపోయింది." అన్నాడు.

"దేవరాజా మీకు వయస్సు పైబడింది కాని, రాజైశ్వర్య లంపటత్వంనించి మీకు విరక్తి కలుగలేదు. ఆ జూదరి చేసిన పుణ్యం మీరు చేసిన సహస్రయాగాల కన్నా మహత్తరమైంది. సుకృతకర్మ వల్లనే ఏ పదవులైనా లభిస్తాయి. ఎవరికి పదవి లభ్యమవుతుందో వారు అధికారోన్మాద మదాంధులు కాక సత్కర్మ నిరతులు కావాలి. సత్కర్మనిరతి వలన పదవికి వైశిష్ట్యం వైశాల్యం చేకూరుతాయి. రాజైశ్వర్య వైభవంలో ఒడలుమరచి పాలితుల యోగక్షేమ సౌఖ్యాలను మరిచిన వారి సుకృతకర్మ క్షీణించి పదవీచ్యుతులు పథభ్రష్టులు అవుతారు. బహుమహత్వపూర్ణ పదవీవాల్లభ్యం సంప్రాప్తమైనా కూడా ఏ ప్రాణి ప్రతిష్ఠావైభవాదికాల్లో పడకుండా సత్కర్మాచరణలో సదా ఈశ్వర చింతనలో నిరతనిశ్చిత సంకల్పుడై నిలుస్తాడో అతడే ధన్యాతి ధన్యుడు. పదవి అతనికి కాక అతడే పదవికి అలంకారమవుతాడు. దేవరాజా స్వర్గానికి వెళ్ళండి. అగస్త్యాది మునివర్యులకు అత్యంత ధన సంపత్తిని సమర్పించి వారి పాదాల మీద క్షమాయాచన చేసి, దాన సుకృత కర్మలో దూరమైన మీ సమస్తైశ్వర్యాల్ని హస్తగతం చేసుకోండి" అన్నారు యమధర్మరాజు ఇంద్రునకు పదవీ కర్తవ్యాన్ని బోధిస్తూ. ఆ జూదరి స్వీయ సుకృత కర్మానుసారం నరకయాతన అనుభవించకుండా మహాదాని వైరోచన పుత్రుడు బలి చక్రవర్తియై జన్మించి విఖ్యాతుడయ్యాడు.

❀

(స్కందపురాణం - మహేశ్వర ఖండం కేదారఖండం ఆధారంతో)